ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబర్ 2023



సీతంపేటలో కుండ పోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట మండల కేంద్రంలో ఆదివారం రాత్రి 8 గంటలకుకుండపోత వర్షం కురిసింది. ఉదయం నుండే భగ భగ మండే భానుడు సాయంత్రం వరకు ఎండ కాసింది. అయితే రాత్రి 8 గంటల సమయంలో ఒక్కసారిగా మేఘాలు చల్లబడి కుండపోత వర్షం కురుస్తుంది. సుమారు గంట పాటు వర్షం కుసిరింది. దీంతో అక్కడక్కడ మిగిలి ఉన్న వరి చోట్ల నాట్లు వేయడానికి ఈ వర్షం ఉపయోగపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క గెడ్డల్లో, వాగుల్లో, చెరువుల్లోలో నీరు తగ్గినప్పటికీ ఈ వర్షంతో మళ్లీ వీటిలో జలకళ నిండుకుంది.

మున్సి 'పల్టీ'ని పట్టించుకోరా?



- నెలరోజులుగా స్తంభించిన పురపాలన
- ఎక్కడ సమస్యలు అక్కడే
- కమిషనర్ నియామకంపై సందిగ్ధత
- డిప్యూటీ సిఎం సిఫార్సుకు మోక్షమెప్పుడో?

ప్రజాశక్తి - సాలూరు

మున్సి'పల్టీ' కొడుతున్నా స్థానిక పాలకుల్లో చలనం లేదు. నెలరోజులుగా పురపాలన స్తంభించింది. గత కమిషనర్ హెచ్ శంకరరావు ఎసిబి వలలో చిక్కి సస్పెండ్ కావడంతో కొత్త కమిషనర్ నియామకంపై ఇంకా స్పష్టత లేదు. దీంతో పురపాలన ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా తయారైంది. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానం చెప్పే నాధుడు కరువయ్యారు. ఇన్‌ఛార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎఇ సూరినాయుడు భయపడుతూ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డిఇ ఇంఛార్జిగా ఆయనే వ్యవహరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తనకు ఇంఛార్జి కమిషనర్ బాధ్యతలు తలకుమించిన భారమని ఆయన భావిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి విజయకుమార్ విధుల్లో చేరిన నెలరోజులకే బదిలీపై వెళ్లిపోయారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి టి.రమేష్ మృతి చెందారు. దీంతో జనం సమస్యలు ఎక్కడికక్కడే ఉంటున్నాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అప్పుడప్పుడూ కార్యాలయానికి వస్తున్నా ప్రధాన విభాగాల అధికారులు ఖాళీగా ఉండడంతో అభివృద్ధి పనులు ముందుకు కదలడం లేదు.

మాముళ్లు సమర్పించకే కమిషనర్ నియామకం జాప్యం!

మున్సిపల్ కమిషనర్ నియామకంలో జాప్యానికి అసలు కారణం మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయంలో ఆమ్యామ్యాలు సమర్పించకపోవడమేనని తెలుస్తోంది. ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి ఇద్దరు అధికారులు ఆసక్తి చూపిస్తున్నారు. విశాఖపట్నం జివిఎంసిలో పని చేస్తున్న మహిళా అధికారి ఇక్కడికి కమిషనర్‌గా రావడానికి ఆసక్తి చూపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ కూడా ఇక్కడి రావడానికి ఆసక్తి కనబర్చినట్లు తెలుస్తోంది. వీరిద్దరిలో ఒకర్ని ఇక్కడ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తారనే ప్రచారం గత నెల రోజులుగా జరుగుతోంది. ఈలోగా ఎఇ సూరినాయుడుకు పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పురపాలన ఏదో విధంగా సాగిపోతున్నదనే ధీమాతో ఉన్నతాధికారులు ఉన్నట్లు కనిపిస్తోంది. అయితే ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతున్న అధికారుల్లో ఎవరో ఒకరు మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి నియామకానికి అవసరమైన ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. కానీ వారు ఆవిధంగా వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో కమిషనర్ నియామక ప్రక్రియ జాప్యం అవుతున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి.

డిప్యూటీ సిఎం లేఖకు మోక్షమెప్పుడో?

స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న డిప్యూటీ సీఎం రాజన్నదొర మున్సిపల్ కమిషనర్‌గా పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ జయరాంను నియమించాలని సిఫార్సు లేఖ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయన సిఫార్సు లేఖ ఇచ్చి నెలరోజులు దాటిపోయింది. అయినా మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి స్పందన లేకపోవడం చర్చనీయాంశమైంది. డిప్యూటీ సిఎం హోదాలో ఉన్న రాజన్నదొర సిఫార్సుకే దిక్కు లేని పరిస్థితి ఏర్పడింది.

20న ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర షెడ్యూల్ తెగలు (ఎస్.టి) కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఈ నెల 20న జిల్లాకు వస్తున్నారని డిటిడబ్ల్యుఒ కె. శ్రీనివాస రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని, గిరిజన సంఘాలు, వ్యక్తుల నుండి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరిస్తారని ఆయన చెప్పారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సాలూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు అన్నారు. ఆదివారం పట్టణంలోని 28,29 వార్డుల్లో కొత్తగా మంజూరైన వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లను ఆయన కౌన్సిలర్లు బి.శ్రీనివాసరావు, గొర్లి వెంకటరమణతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను పేదలకు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం తమదేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని మళ్లీ గెలిపించాలని గిరిరఘు కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న శ్రామికమహిళా రాష్ట్ర నాయకులు మణి, వేదికపై పలు ప్రజాసంఘాల నాయకులు

మహిళా సాధికారత జాడేది?


- శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు పి.మణి
- పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో శ్రామిక మహిళలు అనేక రూపాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారని, అయితే వీరికి హక్కులు, వేతనాలు కరువయ్యాయని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు పి.మణి ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతరం మహిళా సాధికారతే ధ్యేయమని ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమయ్యాయి తప్ప వారి సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆదివారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో శ్రామిక మహిళా జిల్లా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సు మణి మాట్లాడుతూ రాష్ట్రంలో, జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో మెడికల్ అండ్ హెల్త్, నర్సులు, స్కీమ్ వర్కర్లు, భవన నిర్మాణం, ఇంటి పని వారు, ప్రైవేట్ స్కూల్లో, హాస్పిటల్స్, కాలేజీల్లో, చిన్న పరిశ్రమల వంటి పలు రంగాల్లో అత్యధిక సంఖ్యలో శ్రామిక మహిళలు పనిచేస్తున్నారన్నారు. పురుషులతో సమానంగా పనిచేస్తున్నా వీరికి సమాన వేతనం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాక ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కరువయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, సరళీకరణ విధానాలకు తలుపులు బార్ల తెరుస్తూ కార్మిక వర్గంపై తీవ్ర దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా మనదేశంలోనూ, రాష్ట్రంలోనూ తీవ్ర ప్రతిఘటన జరుగుతుందన్నారు. ఈ పోరాటాల్లో శ్రామిక మహిళలు సమరశీలంగా పాల్గొంటున్నారని, ఐక్య ఉద్యమాలను సంఘటితం చేయడంతో పాటు మొత్తం కార్మిక ఉద్యమంలో శ్రామిక మహిళలందర్నీ సమీకరించే కృషి చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు ఎం.ఉమామహేశ్వరి మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలకు దారితీసే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమింప చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆహార సరుకులు చిల్లర ధరలను నియంత్రించేందుకు కేరళలోని వామపక్ష ప్రభుత్వం అక్కడి ప్రజలకు చౌక ధరల దుకాణాల ద్వారా 16 రకాల నిత్యవసర సరుకులను తగ్గింపు ధరలపై సరఫరా చేస్తుందన్నారు. దీనివల్ల అధిక ధరల ప్రభావం కేరళ ప్రజలపై అతి స్వల్పంగా ఉందని తెలిపారు. కావున అదే విధంగా మన రాష్ట్రంలోనూ నిత్యవసర సరుకులను చౌకధరల దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళల సమస్యలు పరిష్కరించాలని, అధిక ధరలు తగ్గించాలని, నిత్యవసర సరుకులను చౌక ధరల దుకాణం ద్వారా సరఫరా చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రెగ్యులర్ చేయాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని, బాలికలు, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వి.రామలక్ష్మి పెట్టిన తీర్మానాలను సదస్సులో పాల్గొన్న మహిళలంతా ఆమోదం తెలిపారు. హింస లేని సమాజం కోసం పోరాడుదామని నినదించారు. సదస్సులో అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జి.జ్యోతి, జి.తులసి, ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో భవన నిర్మాణ నాయకులు ఎం.గౌరమ్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, నాయకులు బి.సూరిబాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, పలువురు శ్రామిక మహిళలు, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.



తీర్మానాలను ఆమోదిస్తున్న శ్రామిక మహిళలు



జరడలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గిరిశిఖర గ్రామాల్లో గజరాజులు సంచారం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గిరిశిఖర గ్రామమైన జరడలో నాలుగు ఏనుగుల గుంపు సంచరిస్తుంది. ఇటీవల సీతంపేట, భామిని అటవీ ప్రాంతాల్లో సంచరించిన ఈ ఏనుగుల గుంపు గత కొద్దిరోజులుగా నీలకంఠాపురం, జరడ ఏజెన్సీ ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అటవీశాఖ అధికారులు ఆయా గిరిజన గ్రామాల్లో ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అటవీ ఫలసాయాలు నమ్ముకొని జీవనం సాగిస్తున్నామని, నిత్యం కొండ ప్రాంతాలకు వెళ్లి రావాల్సి వస్తుందని ఏ క్షణాన ఏం జరుగుతుందని భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. శాశ్వతంగా తమ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించి వాటి భారి నుండి తమ పంటలను, ప్రాణాలను రక్షించాలని కోరుతున్నామన్నారు.

స్వర్ణోత్సవాలకు సిద్ధం కావాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సాలూరు

యుటిఎఫ్ ఏర్పడి 50ఏళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో స్వర్ణోత్సవాల నిర్వహణకు ఉపాధ్యాయులు సిద్ధం కావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు కోరారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సన్నాహక ప్రచారంలో భాగంగా సాలూరు, పాచిపెంట మండలాల్లో పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో స్థానిక లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈనెల 21న బైక్ జాతా ఇచ్ఛాపురంలో ప్రారంభమై 22న పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట కి చేరుతుందని చెప్పారు. అక్కడ నుంచి పార్వతీపురంలో పైలాన్ ప్రారంభం అనంతరం బొబ్బిలి జాతా చేరుతుందని తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించే కార్యక్రమాల్లో సాలూరు, పాచిపెంట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మురళీమోహన్ కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.విజయకుమార్, మండల అధ్యక్షుడు కె.జానకీరావు, కార్యదర్శి ఎ.గణేష్, జిల్లా సభ్యులు సింహాచలం, జగదీష్,సీతయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్: యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఈనెల 22న బైక్ ర్యాలీ జిల్లాలో ప్రవేశిస్తుందని, ఈ జాతాను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఏర్పడిన యుటిఎఫ్ ఉపాధ్యాయులకు ఎన్నో మేలైన, మెరుగైన అంశాలను సాధించిందన్నారు. ఈ 50ఏళ్లలో అనేక సమరశీల పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఉద్యమం అనేక ఓడిదుడుకులకు గురైనప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు బిగించినప్పటికీ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఏనుగుల సంచారంపై అప్రమత్తం : డిఎఫ్‌ఓ

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏనుగుల సంచారంపై అటవీశాఖ ఆయా ప్రాంతాల ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆది వారం జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి ప్రసూన ఒక ప్రకటన విడుదల చేశారు. ఒంటరి ఏనుగు హరి ఆర్తాం కొండపై ఉందని, మిగిలిన ఏడు ఏనుగుల గుంపు పార్వతీపురం రేంజ్ దుగ్గి ముంపు ప్రాంతంలో ఉండగా, నాలుగు ఏనుగుల గుంపు కురుపాం రేంజ్‌లోని జరడ గ్రామం వద్ద ఉన్నాయని ఆమె తెలిపారు. వినాయక చవితి సందర్భంగా మానవ - జంతు సంఘర్షణలు జరగకుండా ఏనుగుల జాడ ఎప్పటికప్పుడు గమనించేందుకు అటవీ సిబ్బంది సంఖ్యను పెంచినట్టు తెలిపారు. ఈ మేరకు పలు సూచనలు చేస్తూ వాటిని పాటించాలని ఆమె కోరారు. వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మైక్ (సౌండ్ సిస్టం) ల నుండి 70 డేసిబుల్స్ శబ్దం కంటే తక్కువగా ఉండేలా చూడాలని, సాయంత్రం 6 గంటల తర్వాత కొమరాడ మండలం పాతదుగ్గి, కొత్త దుగ్గి, పాత కళ్ళికోట, కొత్త కళ్ళికోట, గారవలస, గంగడవలస, సోమినాయుడువలస, కుమ్మరిగుంట, అంకుల వలస, పంతులవలస, రావికర్రివలస, రాజలక్ష్మిపురం, కందివలస, కొనవలస, కొత్తూరు, దంగభద్ర, పరశురామ్ పురం, చంద్రంపేట, పాత మార్కొండపుట్టు, కొత్త మార్కొండపుట్టు, గున్నానాపురం, గదబవలస, కొత్త గున్నానపురం, ఆర్తం చిన్నవలస, ఆర్థాం పెద్దవలస, విక్రంపురం, ఆర్థాం, కోటిపాం, కోదుల గుంఫ, గుంపగదబవలస, దలైపేట, బిత్రపాడు, మాదలంగి, వనం, కిచ్చాడ తోరుము, కొట్టు., జియ్యమ్మవలస మండలంలో బాసంగి, వెంకటాపురం, గిజబ, జరడ తదితర గ్రామాల్లో పాటలు వేయవద్దని కోరారు. తద్వారా ఏనుగులు చికాకు చెంది దాడులు చేసే అవకాశం ఉంటుంది. నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశాన్ని సంబంధిత బీట్ ఆఫీసర్ కు తెలియజేయాలన్నారు. వీటితో పాటు మరిన్ని సూచనలు చేశారు. అలాగే ఏనుగుల సమాచారం కోసం పార్వతీపురం బీట్ ఆఫీసర్ (ట్రాకర్) 8790418198, కొమరాడ బీట్ ఆఫీసర్ - 9398468628, 9398452958, పూజారిగూడ బీట్ ఆఫీసర్ - 6303126934, 8309397085 సంప్రదించాలని సూచించారు.

పద్యనాటకాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

తెలుగువారికే సొంతమైన పౌరాణిక పద్యనాటకాలను పరిరక్షించుకోవాలని జాయింట్ ఆర్.గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కల్యాణమండపంలో ఉత్తరాంధ్ర కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీవాణీ, శివాని సంఘం అధ్యక్షులు బడే శ్రీరాములు ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక పద్యనాటక పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దేశంలో ఎన్ని భాషలున్నప్పటికీ తెలుగుపద్యం ప్రక్రియ ప్రత్యేకతే వేరని అన్నారు. మారుతున్న కాలం, ప్రజల అభీష్టాలకు అనుగుణంగా పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గుతున్నప్పటికీ ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్న సంస్థలకు చెందిన వారి వల్లే ఇంకా రాష్ట్రంలో పౌరాణిక నాటకం బతికి ఉందని అన్నారు. విరివిగా ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. పౌరాణిక నాటకాలను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంగా ప్రభుత్వం నంది నాటకపోటీలకు సన్నద్ధమౌతున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉత్తరాంధ్రకు చెందిన ప్రముఖ కళాకారుడు రాజాంకు చెందిన నక్షత్రక పాత్రధారి యడ్ల గోపాలరావుకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించిన నేపథ్యంలో ఆయనకు నిర్వాహుకులు కిలో వెండి కిరీటాన్ని జెసి చేతులు మీదు అందజేసి, శాలువాతో సత్కరించారు.

పౌరాణిక పద్యనాటక పోటీల ప్రారంభ సభలో జాయింట్ కలెక్టర్ గోవిందరావు



పద్మశ్రీ అవార్డు గ్రహీత గోపాలరావును సన్మానిస్తున్న ఉత్తరాంధ్రకళాకారులు సంక్షేమ సంఘం నాయకులు



గయోపాఖ్యానం పద్యాలను ఆలపిస్తున్న అమరాపు కృష్ణమూర్తి, బలరాం స్వామి

ప్రేక్షకులను కట్టేపడేసిన పద్యపరిమళాలు

ఈ పోటీలు సందర్భంగా కెల్ల గ్రామానికి చెందిన గుంటెడ్డి బలరాంస్వామి, రాజాంకు చెందిన అమరాపు కృష్ణమూర్తి గయోపాఖ్యానంలో కృష్ణుడు, అర్జునుడు పాత్రల్లో ఆలపించిన పద్యాలు సభికులను కట్టిపడేశాయి. శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడుగా కొమరాడకు చెందిన గులిపల్లి చినతిరుపతిరావు, ఆంజనేయుడుగా అలుగోలు శంకరరావు రాగయుక్తంగా ఆలపించిన పద్యాలు రంజింపజేశాయి. పార్వతీపురంకు చెందిన పట్నాల నరసింహాచారి హరిశ్చంద్రుడుగా, వీరఘట్టంకు చెందిన చింతాడ గోవిందమ్మ చంద్రమతిగా శ్రోతలను ఎంతగానో అలరించారు. మోహినీ భస్మాసుర నాటకంలో భస్మాసుర పాత్రధారి మగ్గూరుకు చెందిన వంగపండు కృష్ణ, శ్రీకాకుళంకు చెందిన మోహిని పాత్రధారి దుర్గాకల్యాణి, శివుడుగా రుషింగికి చెందిన శివాల అప్పలనాయుడు పద్యాలు మైమరిపించాయి. ఈ అర్ధరాత్రి వరకూ కొనసాగే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు, నగదు బహుమతులను అందచేస్తామని నిర్వాహకులు అమరాపు రామకృష్ణ తెలిపారు.

పూజా సామగ్రికి రెక్కలు

- కిటకిటలాడిన బజార్లు
- గ్రామాల్లో నెలకొన్న వినాయక చవితి సందడి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఆదివారం స్థానిక ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాల వ్యాపారులతో పాటు ఫుట్‌పాత్ వ్యాపారులు అమ్ముతున్న పూజా సామాగ్రికి రెక్కలు వచ్చాయి. ముఖ్యమైన పండగల సందర్భంలో ప్రజల అవసరాలను సొమ్ము చేసుకునే దిశగా వ్యాపారస్తులు ముందుకు వెళ్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆదివారం నాడు మార్కెట్లో అమ్ముతున్న పూజా సామాగ్రి రేట్లను అధికంగా పెంచి అమ్మడంతో సామాన్య ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పూజకు కావాల్సిన అలంకరణ సామాన్లు, కొబ్బరి కాయ, ఎలక్కాయ, మారెడుకాయ, సీతాఫలం, అరటి, జామ, జొన్న పొత్తులు, పండ్ల రకాలతో పాటు మామిడి కొమ్మలు, మారేడు, ఉసిరి, తులసి పత్రిల రేట్లు అధికంగా పెంచి అమ్ముతున్నారు. అరటి పండుల వంద రూపాయల నుంచి రూ.80వరకు విక్రయిస్తున్నారు. అలాగే కొబ్బరికాయ రూ.30, మారేడు, సీతాఫలం, ఎలక్కాయ తదితర పండ్లు ఒక్కొక్కటి రూ.20చొప్పున విక్రయించారు. దీంతో భక్తులు చేసేదిలేక పూజా సామాగ్రిని కొనుగోలు చేశారు.

విద్యుత్ దీపాల అలంకరణతో మండపాలు

వీరఘట్టం : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ అలంకరణలతో వినాయక మండపాలు దర్శనమిస్తున్నాయి. సోమవారం జరగనున్న వినాయక చవితి ఉత్సవాలకు ఇప్పటికే వినాయకుని విగ్రహాలు పెట్టేందుకు మండపాలు సిద్ధం చేశారు.



పార్వతీపురంలో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్



వీరఘట్టంలో మండపాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలంకరణ

గ్రామాల్లో వినాయక చవితి సందడి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏ గ్రామంలో చూసినా వినాయక చవితి వేడుకలతో సందడి వాతావరణం కనిపిస్తుంది. వినాయక చవితి ఉత్సవాల్లో యువత, మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రభుత్వ ఆంక్షలు పాటిస్తూ, పోలీసుల అనుమతితో విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. పందిళ్ల ఏర్పాటుతో గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది. గ్రామాల్లో ప్రతి వీధిలో వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో పెద్ద సంఖ్యలో వినాయక బొమ్మలు అమ్మకాలు జోరు అందుకున్నాయి. ఒక్కొక్క బొమ్మ రూ.1000 నుంచి రూ.20000 వరకు ధర పలుకుతుంది.


వృద్ధురాలికి బుక్‌లెట్‌ను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

వైసిపి సంక్షేమ ప్రభుత్వం

ప్రజాశక్తి - సాలూరు రూరల్

వైసిపి ప్రభుత్వం సంక్షేమమని డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. మండలంలోని పురోహితునివలసలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉండే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరుపున సంక్షేమ పథకాలను అందించాలని లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఇందులో భాగంగా సాలూరు గతంలో ఎన్నడూ లేనివిధంగా నేడు నేరుగా లబ్ధి దారుని ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. ఇంకా సంక్షేమం అందని వారికి కూడా వాలంటీర్ల ద్వారా సర్వే చేయించి వారికి కూడా పథకాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి జి.రాములమ్మ, వైస్ ఎపిపి రెడ్డి సురేష్, సర్పంచ్ బంకూరు తిరుపతిరావు, ఎఎంసి వైస్ చైర్మన్ బంకురు శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

బిటి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో జి.శివడ పంచాయతీలో గల పలు గిరిజన గ్రామాలకు బిటి రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే పాముల శ్రీవాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జి.శివడ నుండి మడ్డుగూడకు రూ.కోటీ 60 లక్షలు, మడ్డుగూడ గ్రామం నుండి నాంద్రగండ గ్రామం వరకు రూ.40 లక్షలు, జి.శివడ బిటి రహదారి నుండి రాముడుగూడ వరకు రూ.90 లక్షలు, రాముడుగూడ నుండి కిడవాయి వరకు రూ.2 కోట్లు, వేపమానుగూడ నుండి కోటకొండ వరకు రూ.78 లక్షలతో మొత్తం ఐదు రోడ్లు గానూ రూ.5 కోట్ల 68 లక్షలతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.మిన్నారావు, వైసిపి నాయకులు గురుబిల్లి రాజారావు, ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, మాజీ ఎంపిపి ఇందిరాకుమారి, మండల కన్వీనర్ గౌరీశంకర్, గుజ్జువాయి సర్పంచ్ నాగేశ్వరరావు, వైసీపీ వాణిజ్య విభాగాల అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు , వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలతో కలగొప్పలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని మొండెంఖల్‌లో గిరిజనులు సాంప్రదాయాలతో ఆదివారం కల గొప్పలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్ద ఇంటి కొప్పుల సూర్యనారాయణ , సర్పంచ్ ఐ.గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రతి ఏటా పంచాయతీలో ఉడుపులన్నీ అయిన తర్వాత రైతులంతా జాన్నివాలుతో పూజలు చేయించి , మేకను కోస్తామని, తుమ్మిక కర్రలు పొలాల్లో పాతుతామని తెలిపారు. పంటలు బాగా పండాలని దేవుని కోరుకుంటామని అన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుడారి వైకుంఠం ఇంటికుప్పల రామకష్ణ, గుడారి రామారావు, గౌడు బుల్లు, ఇసాయి వెంకట్రావు, మొజురు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎపిఒ రోశిరెడ్డి

ఒలింపిక్ షటిల్ బ్యాడ్మింటన్ విన్నర్ కురుపాం

ప్రజాశక్తి - సీతంపేట

ఒలింపిక్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో కురుపాం (రవి, నిఖిల్) జట్టు విన్నర్ కాగా, శ్రీకాకుళం (అభిరాం, ఇజ్రాయిల్) జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ పోటీలను ఐటిడిఎ ఎపిఒ వై.రోసిరెడ్డి, ఎస్ఐ ఎ.నీలకంఠ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు మండల స్థాయి నుండి జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుండి 50 టీములు పాల్గొన్నాయి. ఈ ఒలింపిక్స్‌లో ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఎన్.జాకబ్ దయానంద్, ఇంటర్నేషనల్ షటిల్ బ్యాడ్మింటన్ రిఫరీ సూరిబాబు, మన్యం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షులు ఎం.రామకృష్ణ, సురేష, మధు, రాములు పాల్గొన్నారు.


పేదలకు ఆహారపొట్లాలు అందజేస్తున్న ధర్మారావు

రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిలో పేద రోగులకు ఆదివారం రాష్ట్ర మత్స్యకార నెయ్యిల కుల సంఘం నాయకులు టెక్కలి ధర్మారావు ఆహర పొట్లాలు పంపిణీ చేశారు. తన కుమార్తె టి.హిమబిందు 4వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం పేద రోగులకు ఆహారం అందజేశారు. పట్టణానికి సాలూరు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ప్రతిరోజూ ఆసుపత్రిలో రోగులకు, వారి సహాయకులకు ఆహార పొట్లాలు పంపిణీ పంపిణీ చేస్తున్నారు.

కత్తిమండకు అవార్డు రావడం అభినందనీయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీశ్రీ కళా వేదిక వ్యవస్థాప కులు, కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బోయి భీమన్న అవార్డు రావడం అభినందనీయమని శ్రీశ్రీ కళావేదిక మన్యం జిల్లా అధ్యక్షులు పాలక దేవానంద్ అన్నారు. కత్తిమండ కళలను, కళాకారులను, కవులను ప్రోత్సహించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం వారి ఆదర్శానికి నిదర్శనమన్నారు. కత్తిమండకు అవార్డు రావడం పట్ల గౌరవాధ్యక్షులు వాసుదేవరావు, ముఖ్య సలహాదారి బాలకృష్ణ, కార్యదర్శులు నిర్మల్‌కుమార్, హరి గోపాల్, సభ్యులు శేషగిరి, శేఖర్, సూర్యనారాయణ, జనరల్ సెక్రెటరీ శైలజా అభినందించారు.

చంద్రబాబు అరెస్టు అన్యాయం : శత్రుచర్ల


ప్రజాశక్తి - గుమ్మ లక్ష్మీపురం

టిడిపి అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేయడం వైసిపి దుర్మార్గపు చర్యకు నిదర్శనమని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా జియమ్మ వలస మండల కేంద్రంలో టిడిపి మండల కన్వీనర్ పల్లా రాంబాబు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ఆదివారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న శత్రుచర్ల మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా చంద్రబాబు జైలు నుంచి తిరిగి వస్తారని అన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి కురుపాం నియోజకవర్గం ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతోనే చంద్రబాబును అరెస్టు చేశారని అన్నారు. కార్యక్రమంలో అనంతరం గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. టిడిపి రిలే నిరాహార దీక్షకు జనసేన నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు, అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, టిడిపి కురుపాం నియోజకవర్గ నాయకులు వైరిచర్ల వీరేష్‌దేవ్, ఎంపిపి బొంగు సురేష్, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురనా శ్రీరామ్మూర్తి, గుమ్మలక్ష్మీపురం మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, జనసేన గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షులు కడ్రక మల్లేశ్వరరావు, జియమ్మ వలస మండల కన్వీనర్ వారణాసి శివ, కార్యదర్శి తాడేల శ్రీరామ్, టిడిపి నాయకులు, జనసేన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో పాలకొండ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు బిడ్డిక దమయంతి నాయుడు ఆధ్వర్యంలో ఆమె ఇంటి వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బాబుని అక్రమ అరెస్టులు అన్యాయమన్నారు. 2024 ఎన్నికల్లో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు బి.జయలక్ష్మి, కార్యకర్తలు కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అర గుండు గీయించుకున్న గిరిజన నాయకుడు

సాలూరు: మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా పట్టణంలో టిడిపి ఆధ్వర్యాన దీక్షలు కొనసాగుతున్నాయి. తెలుగు యువత ఆధ్వర్యాన దీక్షలను వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ దీక్షల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును వైసిపి ప్రభుత్వం అక్రమం గా అరెస్టు చేసిందని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దీక్ష శిబిరం లో పాల్గొన్న గిరిజన నాయకుడు చోడిపిల్లి మాలతీదొర చంద్రబాబు నాయుడు అరెస్టు కి నిరసనగా అరగుండు గీయించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఆముదాల పరమేష్, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, కౌన్సిలర్ వి.హర్షవర్ధన్ పాల్గొన్నారు.


సాలూరు : దీక్షలో అరగుండు గీయించుకుంటున్న గిరిజన నాయకులు మాలతీదొర


దీక్షలో పాల్గొన్న విజయరామరాజు

పార్వతీపురంరూరల్ : చంద్రబాబు అరెస్టును నిర్వహిస్తూ నియోజకవర్గ ఆధ్వర్యంలో చర్చి, మసీదుల్లోనూ సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. సందర్భంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ అవినీతి ప్రభుత్వాన్ని నిలువరించేందుకు టిడిపితో జనసేన కలిసి రావడాని తాము స్వాగతిస్తున్నామని, రాష్ట్ర భవిష్యత్తు దష్ట్యా ప్రజాస్వామ్యక వాదులందరూ కలిసికట్టుగా ఈ ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట నాయుడు మాజీ ఏఎంసీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు కౌన్సిలర్లు కోరాడ నారాయణరావు బడే గౌరీ నాయుడు టి వెంకటరావు కోలా సరిత మధుసూదన్ రావు నాయకులు బార్నాల సీతారామారావు బోను చంద్రమౌళి గురజాన చంద్రమౌళి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా స్థానిక ఆర్‌సిఎం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలపు కష్ణమూర్తి నాయుడు, పాలకొండ మండల అధ్యక్షులు గండి రామినాయుడు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, బల్ల హరిబాబు, తెలుగు యువత నాయకులు మాచర్ల అనిల్, భౌరోతు నీలకంఠం నాయుడు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షులు వెలగాడ శ్రీను , తూముల రమేష్ , రాయి పిల్లి రత్నాకర్ తదితరలు పాల్గొన్నారు.

ప్రకటనలకే పరిమితం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 12 సచివాలయాలు, 10 రైతు భరోసా కేంద్రాలు, ఏడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఈనెల 15 నాటికి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ శాఖ అధికారి ఎంవిఆర్‌జి కృష్ణాజి జులై 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో హుకుం జారీ చేశారు. అయితే ఎక్కడా ఆ పనులు ప్రారంభం కాలేదు. దీంతో అధికారులు ప్రకటనకే పరిమితమవుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలో 24 సచివాలయాల పరిధిలో తెట్టంగి గ్రామ సచివాలయం ఒకటే ప్రారంభమైంది. కిమ్మి, తూడి నడిమికెల్లా, కంబర, వండువ గ్రామాల్లో భవన నిర్మాణ పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక తలవరం, చిదిమి, కత్తుల కవిటి, హుస్సేన్‌పురం, దశమంతపురం, చిట్టిపూడివలస, పనసనందివాడ, వీరఘట్టం-4 గ్రామ సచివాలయాలు ప్లాస్టింగులకు పరిమితం అయ్యాయి. ఇక మండల


ఘూసి వీధిలో బోర్డుకు పరిమితమైన వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్

ప్రారంభానికి నోచుకోని భవనాలు


చిన్నదొర కాలనీలో పునాదులకే పరిమితమైన సచివాలయం, వెల్‌నెస్, ఆర్‌బికెలు

కేంద్రమైన వీరఘట్టంలోని 2,3 సచివాలయాలు శ్లాబ్‌లకే పరిమితిమయ్యాయి. మిగిలిన సచివాలయాలు ఏళ్ల గడుస్తున్నా పునాదులకు పరిమితమయ్యాయని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలకు వచ్చే సరికి హుస్సేనపురం రైతు భరోసా కేంద్రమే ప్రారంభానికి సిద్ధంగా ఉంది, బిటివాడ, పనస నందివాడ, చిట్టిపూడివలస, వీరఘట్టం, తదితర సచివాలయాలు శ్లాబులకు పరిమితమయ్యాయి. చలివేంద్రి, చిన్న ఘోర కాలనీ, తదితర సచివాలయాలు గ్రౌండ్ లెవెల్‌కే పరిమితమైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వైయస్సార్ క్లినిక్లకు వచ్చేసరికి వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లు వీరఘట్టం తప్ప మిగిలిన చోట్ల బోర్డులకే పరిమితమయ్యాయి. దీంతో సిబ్బంది ఇరుకైన భవనాల్లో, చెట్లు నీడలో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమావేశాలకు పరిమితం కాకుండా భవనాలు పురోగతికి వచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మేలో బిల్లులు... సెప్టెంబర్‌లో పనులు

ఇది విద్యుత్తు శాఖ లీలలు

ప్రజాశక్తి - మక్కువ

'వడ్డించేవాడు మనవాడు అయితే... కడబంతిలో కూర్చొన్నా అందుతుందన్న చందగాన ఉంది విద్యుత్ శాఖ అధికారులు పనితీరు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కైతే ఏ విధంగా ప్రభుత్వ ధనాన్ని ముందే వాడుకోవచ్చన్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది.


ఇటీవలే మార్కండ పుట్టిలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీలో లోవోల్టేజ్ పునరుద్ధరణకు విద్యుత్ శాఖ 40 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్ నిర్మాణం చేపట్టి సమస్యను లేకుండా చేయాలని తలించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ గత ఏడాది ప్రతిపాదనలు చేసింది. అలాగే మంజూరు కూడా అయ్యింది. ఈ పనుల కోసం సంబంధిత కాంట్రాక్టర్‌కు మే నెలలో కూలీలకు బిల్లులు కూడా సుమారు రూ.48వేలు పైచిలుకు చెల్లింపులు కూడా చేపట్టారు. అయితే ఈ పని అప్పట్లో పూర్తి చేయలేదు. ఇటీవల విద్యుత్ శాఖలో జరిగిన పలు అంశాలు కూడా ఈ పని వెలుగులోకి రావడానికి కారణమైంది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అసంపూర్తిగా ఉన్న పని ఈనెల రెండో వారంలో పూర్తి చేశారు. ఆదరా బాదరాగా చేసిన పనిని చూసి గ్రామస్తులు కూడా ఆశ్చర్యపోయారు. కాంట్రాక్టర్‌కు విద్యుత్ శాఖ అధికారులు ముందే బిల్లులు చెల్లింపు విషయమై సంబంధిత కాంట్రాక్టర్‌కు విద్యుత్ శాఖ అధికారులకు ఉన్న బంధం ఇట్టే తెలుస్తోంది. ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ చేతులు కలిపితే ఇలాంటి అక్రమాలు ఎన్నో జరిగి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఈ విషయంపై ఆరా తీస్తే మరింత అవినీతి వెలుగు చూసే ఆస్కారం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజనుల కాపాడాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజనులకు మౌలిక సదుపాయాలు కల్పించి వారి స్థితిగతులను మార్చాలని సిపిఎం నాయకులు కొల్లేసాము మూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం చినఖర్జేల పంచాయతీ సీసాడ వలసలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ వర్షం పడితే ఈ గ్రామమంతా ఊటనీరుతో నిండిపోయి విష జ్వరాలతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుందన్నారు. తక్షణమే ఈ గ్రామానికి సిసి రోడ్డు, కాలువలు మంజూరు చేసి, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన కుటుంబాలకు భరోసా కల్పించాలని ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో కోరారు. కార్యక్రమంలో చిలకమ్మ, సోములు, రాజేష్, పకీరు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఆవరణంలో పిల్లలతో నీతి కథలు, మానసిక ఉల్లాసాన్ని పెంపొందేందుకు ఆటలు, పాటలను శాఖా గ్రంథాలయ నిర్వహకులు నల్ల మధుసూదనరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయన పిల్లలతో మాట్లాడుతూ సంపదలు అన్నిటికంటే చదువు ఉన్నతమైందని తెలిపారు. అందుకు విద్యార్థులు తప్పక చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు. ఇంటిలో ఖాళీ సమయాల్లో సెల్ ఫోన్‌కు సమయము ఇవ్వకుండా పుస్తకాలు పట్టుకోవాలని స్కూల్లో ఇచ్చిన హోం వర్క్‌లు ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జంక్షన్లో ఎల్విఆర్ సంస్థ, పెదబోగిలి ఉపసర్పంచ్ కె అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని టిడ్కో చైర్మన్ జమ్మాన్న ప్రసన్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలు మంచిదని, ఎటువంటి కాలుష్యం లేకుండా ఉంటుందని అన్నారు పర్యావరణాన్ని కాపాడ్డానికి అందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మమ్ములు విశ్వేశ్వరరావు, గ్రామ పెద్దలు ఎస్ ప్రసాద్, ఎస్.కొండలరావు, ఎస్.హరిగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : మట్టి విగ్రహాలు పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుస్తాయని వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటీశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో గల డౌన్ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో


కురుపాం : విగ్రహాలు పంపినీ చేస్తున్న అంధవరపు కోటేశ్వరరావు


సీతానగరం : విగ్రహాలు పంపినీ చేస్తున్న టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

500 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు ఇటువంటి ఆలోచనలు వచ్చి పర్యావరణానికి ముప్పు కలక్కుండా ఉచితంగా విగ్రహాలు పంపిణీ చేయడంతో యువతను అభినందించారు. ఈ సందర్భంగా కురుపాంలో పలు వీధి యువతకు ఆయన విగ్రహాలను అందజేశారు. కార్యక్రమం లో డౌన్ బాయ్స్ యూత్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సాలూరు: మట్టి వినాయక బొమ్మలు పర్యావరణానికి ఎంతో మేలని టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. వినాయక చవితి సందర్భంగా ఆదివారం పట్టణంలోని చిన బజారు సెంటరులో మయూరి హొటల్ యజమాని శ్రీనివాసరావు ప్రజలకు మట్టి వినాయక బొమ్మలను సిఐ (చేతులు మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన వినాయక బొమ్మలతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని చెప్పారు.

ఘనంగా విశ్వకర్మ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో విశ్వకర్మ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నెయ్యిల వీధిలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ నూతన విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ తమ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలవడం జరుగుతుందని తెలిపారు. విశ్వకర్మ భగవానుడు విశ్వాన్ని సష్టించిన వ్యక్తి అని.. విశ్వకర్మలను విశ్వ భగవానుడి వారసులుగా ఆయన పేర్కొన్నారు. అనంతరం కొత్తవలస ఫ్లైఓవర్ ప్రాంతంలో గల దుర్గ చెట్టు ప్రాంగణంలో కార్పెంటర్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకలులో ముఖ్య అతిథులుగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణు లకు నామినేటెడ్ పదవులు, పనుల్లో ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. విశ్వ బ్రాహ్మణుల అభివద్ధి, సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయడమే కాకుండా బీసీ సమస్యల పరిష్కారానికి శాశ్వతంగా బిసి కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. 50 ఏళ్ల వారికి పింఛను, ఆర్థికంగా అండగా నిలిచేలా రాబోయే పార్టీ మేనిఫెస్టో పెట్టించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందరికీ అవసరం అయినా కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు స్థలం కూడా త్వరలో మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమాలలో పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, విశ్వబ్రాహ్మణులు సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు, పెద్దలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

నేరాలు ఘోరాలు

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బెలగాం

పార్వతీపురం మండలం నర్సిపురం రైల్వే గేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. నర్సిపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ తాబేలు నరేష్ (30) పని డబ్బు లు కోసం రైల్వే ట్రాన్స్ అవతల ఉన్న బిసి కాలనీకి వెళ్తున్నాడు. పట్టాలు దాటుతున్న సమయంలో ఎదురు వస్తున్న గూడ్స్ రైలు రాకను గమనించకపోవడంతో ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హెచ్‌సి రత్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

బాడంగి : మండలంలోని జికెఆర్‌పురం గ్రామానికి చెందిన గొట్టాపు జగన్మోహన్‌రావు (48) ఆదివారం తోటపల్లి కాలువలో పడి మృతి చెందాడు. మృతుని భార్య రాధ చెప్పిన వివరాలు ప్రకారం...మాది సొంత ఊరు జికెఆర్‌పురం అయినప్పటికీ బొబ్బిలిలో నివాసముంటూ చిన్న చిన్న వ్యాపారం చేసికొంటూ జీవనం కొనసాగిస్తున్నాం. ఇద్దరు ఆడ పిల్లలు కూడా ఉన్నారు. కుటుంబ సమేతంగా శనివారం వినాయక చవితి కోసం సొంత ఊరు వచ్చాం. ఆదివారం ఉదయం 7 గంటలకు బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఎంత సేపటికి రాకపోవడంతో ఊరు వాళ్లంతా వెతికారు. చివరికి తోటపల్లి కాలువ వైపు వెళ్లి పడిపోయాడని గ్రామానికి చెందిన దేవర కృష్ణ, సత్తిబాబు చూసి తీసేసరికి చనిపోయాడని తమకు చెప్పినట్లు రాధ తెలిపారు. దీనిపై ఎస్ఐ జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవేశ్య గున్నేష్ ఫౌండేషన్ సభ్యులు గునేష్

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని ఉషా, గున్నేష్ ఫౌండేషన్ సభ్యులు ఇందుపూరు గున్నేష్ అన్నారు. ఉషా, గున్నేష్ ఫౌండేషన్, శ్రీవాసవి ఆర్యవైశ్య సంఘం, నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వీధిలో ఉన్న శ్రీ వాసవి ఆర్యవైశ్య ఇందుపూరు వెంకటరావు కళ్యాణ వేదికలో జరగబోయే శిక్షణా తరగతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. కల్యాణ వేదికలో జరిగే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో 75మంది నిరుద్యోగ యువకులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం గున్నేష్ యువకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ఫౌండేషన్‌ను ఉన్నత ఆశయాలతో నెలకొల్పడం జరిగిందని, ఎంతోమంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగం కల్పన అందించేందుకు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈనెల 20 నుంచి గ్రూప్ 1,2, ఎస్ ఐ, బ్యాంకింగ్, ఆర్ ఆర్ బి, సచివాలయ ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రతిభావంతులైన శిక్షకులచే శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఏకాగ్రతతో ఈ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత ఉద్యోగాలను పొంది నిర్వాహకులకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమములో ం శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కాలుష్యం నివారణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రజలు, భక్తులకు సందేశాన్ని ఇవ్వడానికి పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాన్ని తయారు చేశారు.